# సీతారాములమీద శారదా ఆక్టు

శ్రీ యండమూరి సత్యనారాయణరావు
బి. యే. బి. యిడి.

(కోర్టులో అందఱూ తీర్చిఉంటారు. న్యాయమూర్తి కేసు విచారిస్తూ ఉంటాడు. చుట్టూ జనం గుమిగూడి ఉంటారు. రకరకాల మనుషులు, భక్తులు రక్తులూ, బిళ్ల గోచీలవారు, ఒకగోచీలవారు, కాలిపంచెలవారు, పంగ నామాలవారు, పిండికట్లవారు, తెగగొరుగుడు మీసాల వారు, గెడ్డాలవారు, అరమీసాలవారు, తుప్పతిలల వారు, వగ్గెవాటులవారు ఇలాగ అనేక విధాల మనుషులు ఆత్రుతగా వింటూఉంటారు. న్యాయమూర్తిమాటలు విన బడుతూ ఉంటాయి. చిత్రగుప్త ప్రాసిక్యూటరు ముఖ్య ప్రశ్నలు వేస్తూ ఉంటాడు.

న్యాయమూర్తి:- ఏమండీ, ఛాదస్తం శరభయ్య శాస్త్రులుగారు తమరేనా!

శరభ:- చిత్తం: ప్రభువు వారి అనుగ్రహించాలి, నేనేనండీ మహాప్రభూ!

న్యాయ:- అయితే మీరు శారదాయాక్టు ప్రకారం 14 యేండ్లకులోపు వయస్సుగల అబ్బాయికి, అలాంటి అమ్మాయికి పెళ్లిచేశారుగద కనుక మీకు శిక్షవిధించాలి మీరు ఏమిచెప్పుకుంటారు.

శరభ:- చిత్తం ప్రభువారు కటాక్షిస్తే నే నేను నిజంగా అపరాధిని గానండి. నేను చేసిన పెండ్లివిషయం యేదో అసలు అలాంటిదేమీ మాయింట్లో మొన్న నవమి నాడు ఏమీ జరగలేదని మనవి చేస్తున్నానండి.

చిత్రగుప్త:- మొన్న చైత్రశుద్ధ నవమి నాడు మధ్యాహ్నం 12 గంటలు వేళ కల్లగుంట కాపురస్థులు, శ్రీ ఛాదస్తం శరభయ్యశాస్త్రుల్లుగారి స్వగృహ మందున యజుకూరు కాపురస్థులైన అందఱి సమక్షం లోను యథావిధిగా, సశాస్త్రీయంగా, భాజాభజంత్రీ మేళతాళాది వగైరాలతో చార్జిషీటులో దాఖలు చేయ బడిన సదరు రామచంద్రారావుకీ, జానకమ్మకీ వివాహం జరిగింది. సదరు వధూవరులు ఇద్దఱికి సుముహూర్తం నాటికి కేవలం 14 సంవత్సరాలకీలోపే ననిన్నీ అందుచేతను యీ శరభయ్యశాస్త్రుల్లుగారిని శారదా శాసనం ప్రకారం శిక్షింపవలసిందనిన్నీ యిందులో యేమా త్రం అబద్ధంలేదనిన్నీ కోర్టువారి దివ్యసముఖానికి యిందు మూలంగా మనవి చేయడమైనది. ఇందుకు సాక్షులని విచారించి నిజం స్థిరపఱచి కోర్టు వారు శిక్షింపడానికి గాను కోరబడుతున్నారు.

1-వ సాక్షి:- శ్రీ చలంగారు ప్రవేశించి ప్రమా ణాలు ఐనతర్వాత,

ప్లీడరు:—ఏమండీ చలంగారు, తమరు వివాహం జరగడం చూశారా!

చలం:—ఆఁచూశాను.

ప్లీడరు:—ఎన్ని గంటల కయింది.

చలం:—సరిగ్గా 12 గంటలకు.

ప్లీడరు:—మీదగ్గఱ గడియారం ఉందా ?

చలం:—ఔను.

ప్లీడరు:—ఎవరింట్లో జరిగింది ?

చలం:—యీ శరభయ్యశాస్త్రులుగా రింట్లోనే.

ప్లీడరు:—మీరు వివాహం చూడవలసిన అవసరం ఏం వచ్చింది.

చలం:—నేను కోర్టువారికి దాఖలుచేసిన శుభలేఖ నాదగ్గఱకు వచ్చింది దానితో వెళ్ళకపోతే బాగుండదని వెళ్ళేను. అంతే.

ప్లీడరు—మీరు తఱచు వివాహం అక్కర్లేదని చెప్పేకధలు వ్రాస్తూ వుంటారు గాదా!

చలం:—వ్రాస్తాను.

ప్లీడరు:—మీకు భగవంతుడంటేనూ, రాముడంటేను, సీత అంటేనూ, గౌరవం ఉన్నట్లు మీవ్రాతలు వ్రాస్తూ ఉండరుగదా!

చలం:—నావ్రాతలు ఎలాగ అర్థమౌతాయో నే చెప్పలేను.

ప్లీడరు:—మీరు తాంబూలంగాని, అలాంటి సత్కార్యాలుగాని శరభయ్యగారిచేత పొందారా!

చలం:—అందఱితోపాటు నాకు పన్నీరు అవీజల్లి, తాంబూలం పేళ్ళూ అవీ యిచ్చారు.

ప్లీడరు:—మీకు రాముడంటే భగవంతుడనీ నమ్మకం లేకపోయినా శ్రీరామ నవమి పందిట్లోకి యెందుకు వెళ్ళారు;

చలం:—నాకు నమ్మకమున్నా లేకపోయినా, పిల్లలు ఖులాసాగా భాజా భజంత్రీలు చూస్తారని తీసుకు వెళ్ళమంటే వాళ్లతోకూడా వచ్చా;

ప్లీడరు:—యింక మీసాక్ష్యం ఐపోయింది.

2వ సాక్షి నాయకురాలు, లక్ష్మీకాంతం.

నాయకురాలు లక్ష్మీకాంతం కోర్టులో అందఱికి నమస్కారం పెట్టుతుంది.

ప్లీడరు:—మీరు మేళం వెళ్ళినమాట వాస్తవమేనా!

లక్ష్మీ:—చిత్తం 5 రోజుల కళ్యాణమని శరభయ్య శాస్త్రుల్లుగారే కుదిర్చి తీసుకు వెళ్ళారండి.

ప్లీడరు:—పెళ్ళి నవమినాడు, పెద్దఱికి జరిగిందా!

లక్ష్మీ:—చిత్తం. జరిగిందండి.

ప్లీడరు:—నీకూ యీ శరభయ్య శాస్త్రులు గారికి పూర్వ పరిచయమున్నదా!

లక్ష్మీ:—లేదు.

ప్లీడరు:—మీయింటికివచ్చి మీపిల్లలకువ్రాసిన జాతకాలున్నవా!

లక్ష్మీ:—చిత్తం.

ప్లీడరు:—జాతకాలు మీయింటికివచ్చి వ్రాయలేదా!

లక్ష్మీ:—వ్రాశారు.

ప్లీడరు:—జాతకరీత్యా కాకుండా, వేరే సంబంధమున్నదా దీంతో.

లక్ష్మీ:—లేదు.

ప్లీడరు:—ఇపుడు నీకు వీరికి మనస్పర్థలున్నావా?

లక్ష్మీ:—లేవు.

ప్లీడరు:—అయిపోయింది వెళ్ళవచ్చు.

3 వ సాక్షి. పాపాల భైరవమూర్తిగారు.

ప్లీడరు:—తమరు యీ వివాహానికి వెళ్లారా!

భైరవ:—చిత్తం.

ప్లీడరు:—తమరు యీ వధూవరుల కేవలం 14 సంవత్సరాలకి లోగడే అని నిర్ధారించి చెప్పగలరా?

భైరవ:—ఆ నిరాఘాటంగా చెప్పగలను. అది గాకుండా యీ పుస్తకాలన్నీ ప్రమాణాలు.

ప్లీడరు:—కోర్టువారు సాక్ష్యాలన్నీ విచారించారు. కాని యీ కేసులో ఉదాహరించబడిన, శ్రీ రామచంద్ర, జానకమ్మ అనే వధూవరులు కేవలం మానవ మాత్రులు కాదనిన్నీ వారు సాక్షాత్ భగవంతుడైన శ్రీరాముడును, ఆయనభార్య సీతాదేవిని గనుకను వారిమీద యేమాత్రం యీ కేసు నిలవలేదు. వివాహం జరగడం నిజమే. అది చేసినది శరభయ్యగారే కూడాను. కాని పెండ్లి జైముకిమాత్రం వధూవరులు వయసు 14 సంవత్సరాలు కాకుండా, యెన్నో లక్షల యేండ్లక్రితం శ్రీరాముడి పెండ్లి జరిగింది గనుకను వారివయస్సిపుడు 14 యేండ్లే కాదు. అసలు మనుషులు లేకుండా కేవలం బొమ్మలకి మాత్రం పెళ్లిజరిగిందిగాని మనుష్యులకి జరుగలేదు గనుకను యిది యేమాత్రం నిలువలేదు.

అదీ. యీ సాక్షులవిషయంలో మొదటి, సాక్షి 'చలం'గారు ప్రపంచానికి వ్యతిరేకం. కోర్టువారియెదుట దాఖలు చేసుకున్న రికార్డుల ప్రకారం, వీరు భగవంతుడంటే యేమీ నమ్మకంలేదనీ, వివాహం పనికిరాదనిన్నీ, పతివ్రతలంటేనూ, సనాతనులంటేనూ బొత్తిగా గిట్టదనిన్నీ కోర్టువారికి మనవి చేసుకుంటున్నాను. అదిమర్మ సనాతనవాది ఐన మాక్లయింటు, సదరు శరభయ్యశాస్త్రుల్లుగారిమీద కిట్టనితనంవల్ల యీ సాక్ష్యమిచ్చేరనిన్నీ వీరికి రాముడంటేనూ, పెళ్లి అంటేనూ ఉండుకున సహజవైరమే యిలాంటి సాక్ష్యం యిప్పించిదనీ మనవి చేసుకుంటున్నాను. లక్ష్మీకాంతం విషయంలో, శరభయ్యశాస్త్రుల్లుగార్కి యిదివరకు పరిచయం ఉండి జాతకాలు అవి రాస్తూ యిది చేస్తూ యీమధ్య మానుకున్న దరిమిలాను యీ కల్యాణం విషయంలో రావించి యేర్పాటుచేయడం, చేసి అనుకున్న సంభావన నూరు రూపాయలు సరిగ్గా యివ్వకుండా ఉండడం యీవిరోధానికి కారణమనిన్నీ అంచేత ఆమె సాక్ష్యం మంజూరు లేదనీ మనవిచేస్తున్నా. అనంతరం, భైరవమూర్తి కేవలం కోర్టుపక్షి, యీయన శాస్త్రుల్లుగారి కుమారుడు వివాహం విషయంలో కట్నం బాపతు తకరాలు తెచ్చిపెట్టి శాస్త్రుల్లుగారికీ, వారి వియ్యాలవారికీ లావాదేవీలు తెచ్చిపెట్టి శాస్త్రుల్లుగారికి తిరకాసు తెచ్చిపెట్టడంలో శాస్త్రుల్లుగారి శత్రుకోటిలో జమేగనుకను యీ సాక్ష్యాల్లో ఒక్కటీ నిలవదని మనవిచేస్తున్నా. అందుకుగాను కోర్టువారు చిత్తగించి మాక్లయింటయినటువంటి శరభయ్యశాస్త్రుల్లుగారిమీద కేసు కొట్టివేయించి నష్టపరిహారం ఖర్చులు యిప్పించగలందులకు కోరడమైనది.

చిత్రగుప్త:- మాస్నేహితులు, యెదర పార్టీ ప్లీడరింతసేపూ వాదించినవాదం యేమీ నిలవదని మనవి చేస్తూన్నాను. ముందు శ్రీరాముడు దేవుడయినందువల్ల కేసు నిలవదన్నారు. ఇందుకుగాను నైజాము కోర్టులో, రామదాసు అనే ఆయన దేవుడైన శ్రీరాముడి నిమిత్తాన్ని ఖర్చు చేసి దొంగవని చేస్తే తానీషా చావగొట్టి శిక్షించి తీర్పు యిచ్చారు. కోర్టువారి ఆతీర్పు దాఖలా చూపిస్తున్నాను. అందుచేత దేవుడి విషయంలో అయినప్పటికిన్నీ, నేరం అన్నప్పుడు ఎప్పుడూ నేరమే. మీరు మనుషులుగాదనీ, బొమ్మలనీ ఆవిషయంలో యాక్టు వర్తించదని సెలవిచ్చారు. కాని యీ కళ్యాణం దేవుడికి చేస్తున్నారంటే, లోకాని కందరికీ ఆదర్శప్రాయంగా, ఆదర్శమూర్తి ఐనటువంటి రాముడి కారోపించి చేయడములో మాత్రం, యిది అందరూ యిలాగ చేయమని చెప్పటం, బుద్ధిపూర్వకంగా అలాంటి నేరం అందరినీ చేయమని బోధించినట్లు అర్థమవుతుంది. అదిగాక పెళ్ళినాటికి రామచంద్రరావుకి 14 యేండ్లేనని అతని పెండ్లామైన జానకమ్మకి అంతకంటే, తక్కువనీ, అన్ని రామాయణాలు ఘోషిస్తున్నాయి. అదిగాక యీకాలంలో హిజ్ మాష్టర్సు వాయిస్ రికార్డులో దశరథుడి పద్యంలో "అట్టి పదునాలుగేడుల బాలకుడు అసుర భీ రవనము కనుపుగాడ" నని ఊదిపారేశాడు బిళహరిలో. అంచేత వయస్సు విషయంలో పోటీ లేదు. యీసాక్ష్యాలు విషయంలో కోర్టువారియెదట నున్న ఎవిడెన్స ప్రకారం వారిలో యెవరికీ ముద్దాయి శరభయ్య శాస్త్రుల్లుగారిమీద విరోధం ఉన్నట్టు కనబడదు. అంచేత కోర్టువారు న్యాయం విచారించి యీ ముద్దాయిని, యాక్టుప్రకారం పూర్తిశిక్ష విధించవలెనని ప్రార్థిస్తున్నాను.

న్యాయ:— రెండుపక్షాలు విని, నేను చెప్పే తీర్పేమిటంటే— శరభయ్యశాస్త్రుల్లు చేసింది దేవుడివిషయంలోనైనా సరే నేరమే. అయినప్పటికీ యిది తొలి తప్పు అవడం యిలాంటివి చాలా లోకంలో జరగడంవల్ల, అట్టే జుల్మానా వేయకుండా, విజిలెన్స కమిటీవారికి ఖర్చులు మాత్రం యిచ్చేటట్టుగా శిక్ష విధించి యికముందు యిలాంటి పెళ్లిళ్లు దేవుడికైనాసరే చెయ్యకుండా హెచ్చరించడమైనది.

ఇందుమూలంగా దేవుడివిషయంలో కూడా పెళ్లితంతు జరిపినట్లైతే యేంవిధా శిక్షావిధానానికి తప్పకుండా పాత్రులౌతారు. యెవరైనా యిలాంటివి చేసుకుంటే యేదైనా ఉత్సవాలరూపంగా చేసుకోవచ్చు."